

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు : జెన్పెక్ట్ ఎంఎన్‌సి కంపెనీలో ఉద్యోగాలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్పెక్ట్ ఎంఎన్‌సి కంపెనీ కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1500 ఖాళీల భర్తీకి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు బిటెక్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 2022, 2023, 2024 సంవత్సరాల్లో పాసైన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఈ ఉద్యోగాలు హైదరాబాద్ హఫీజ్‌పేటలోని రోటేషనల్ షిఫ్టుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. https://bit.ly/46Wzqz లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, స్థలాన్ని తెలియజేస్తారని తెలిపారు. వివరాలకు 9666322032, 9652503799 నెంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తెలిపారు.

రుణాలివ్వని బ్యాంకులు..!



కౌలురైతుల పట్ల బ్యాంకర్ల చిన్నచూపు

పంటరుణాల మంజూరులో నిర్లక్ష్యం

పశ్చిమలో రూ.30 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.85 కోట్లు మాత్రమే

రెండు జిల్లాల్లో 70 శాతం వ్యవసాయ సాగు కౌలురైతుల చేతుల్లోనే

ప్రభుత్వం దృష్టిసారిస్తే అన్నదాతకు న్యాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతుల పట్ల బ్యాంకులు చిన్నచూపు చూస్తున్నాయి. పంట రుణాలిచ్చేందుకు ససేమీరా అంటున్నాయి. మమ అన్నట్లు కొద్దిపాటి రుణాలిచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లో కౌలు రైతులకు మంజూరైన రుణాల పరిస్థితిని చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు జరుగుతుండగా 70 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతుల పట్ల అత్యంత నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించింది. కౌలు చట్టంలో మార్పులు చేసి కనీసం కౌలు కార్డులు సైతం అందకుండా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో కౌలు రైతులకు న్యాయం చేస్తామంటూ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. పశ్చిమలో 84 వేల మందికి, ఏలూరు జిల్లాలో 70 వేల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేసేందుకు టార్గెట్లు తీసుకున్నారు. ఈ ప్రకారం చూస్తే ఇంకా దాదాపు లక్షన్నర మందికి కౌలు కార్డులు అందే పరిస్థితి లేకుండా పోయింది. కార్డులు జారీచేసిన రైతులకు కూడా రుణాల మంజూరు సక్రమంగా లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 13 వేల మంది కౌలు రైతులకు రూ.85 కోట్లు, పశ్చిమలో ఐదు వేల మందికిపైగా రైతులకు రూ.30 కోట్లు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించినట్లు లెక్కలు చెబుతున్నాయి. 70 శాతం వ్యవసాయం సాగుచేస్తున్న కౌలురైతులకు ఇచ్చిన రుణాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో వ్యవసాయ రుణప్రణాళికలో భాగంగా పంట రుణాల కింద రూ.వేల కోట్లు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అందులో ఒక శాతం కూడా కౌలు రైతులకు రుణాలుగా బ్యాంకులు అందించడం లేదు. పంట రుణం అనేది సాగుచేసే రైతులకు మాత్రమే అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాలి. బ్యాంకులు ఆ విధంగా నడుచుకోవడం లేదు. సాగుచేయని భూయజమానులకే పంట రుణాలు అందిస్తున్నాయి. సాగుచేస్తున్న కౌలురైతులకు మొండిచేయి చూపిస్తున్నాయి. రైతు సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతులిచ్చినా పరిస్థితిలో మాత్రం మార్పురావడం లేదు. గతేడాది కౌలురైతులకు కొద్ది మొత్తంలో రుణాలు అక్టోబర్‌లో మంజూరు చేశారు. ఆ రుణాలనే ఇప్పుడు మళ్లీ రీషెడ్యూల్ చేయాలని బ్యాంకులు చూస్తున్నాయి. కొత్తగా కౌలురైతులకు రుణాలిచ్చేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. ప్రభుత్వం బ్యాంకర్లపై ఒత్తిడి తెస్తే తప్ప కౌలురైతులకు పంటరుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. వారం, పది రోజులు కౌలురైతుల పంటరుణాల కార్యక్రమాన్ని ఒక డ్రైవ్‌గా చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటేనే వాస్తవ సాగుదారులకు మేలు జరుగుతోంది.

ఇ-క్రాఫ్‌లో కౌలురైతుల పేర్లు చేరిస్తేనే న్యాయం

కౌలు రైతుల పేర్లను ఇ-క్రాఫ్‌లో చేరిస్తేనే న్యాయం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. పంట రుణాలుగానీ, దెబ్బతిన్న పంటలకు పరిహారం, బీమా గానీ, ఇ-క్రాఫ్ ఆధారంగానే ప్రభుత్వం అందిస్తోంది. ఇ-క్రాఫ్‌లో సాగుచేసే రైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లను అధికారులు నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోని వ్యవసాయశాఖ అధికారులపై భూయజమానులు ఒత్తిడి తెచ్చి మరీ తమ పేర్లు నమోదు చేయించుకుంటున్నారు. కౌలురైతుల పేర్లు నమోదు చేస్తే అధికారులతో ఘర్షణలకు దిగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇ-క్రాఫ్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేసేవిధంగా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని అంతా కోరుతున్నారు. కౌలు రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

శ్రీరామమూర్తి జీవితం ఆదర్శనీయం

సంస్మరణ సభలో మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు


వలవల శ్రీరామ మూర్తి జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని అంబేద్కర్ భవనంలో ఆదివారం సిపిఎం జిల్లా సీనియర్ నేత వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, సిపిఎం నేతగా, రైతు ఉద్యమనేతగా ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలి సమసమాజ స్థాపన కోసం సిపిఎంలో చేరారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో శ్రీరామ మూర్తితో పాటు తాను రైతు పోరాటంలో పాల్గొన్నట్లు చెప్పారు. యలమంచిలి మండలంలో రెండో పంటకు బ్యాంక్ కెనాల్ ద్వారా సాగునీరందించాలని పోరాటం చేశామని తెలిపారు. అలాగే శ్రీరామ్మూర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించాలని పోరాటం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరును ఏదో ఒక పథకానికి పెడుతుందని ప్రకటించారు. తాను పోరాటం చేయడమే కాకుండా యలమంచిలి మండలంలో రైతులకు సాగునీరందించేందుకు అధిక ప్రాధాన్యతిస్తామన్నారు. తాను వామపక్ష భావాలతో ఎదిగిన వాడినేనని మంత్రి చెప్పారు. శ్రీరామ్మూర్తి కళ్లు ఇరువురికి దానం చేయడం, మొత్తం బాడీని వైద్య విద్యార్థుల పరిశోధనకు ఇవ్వడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

శ్రీరామమూర్తి సేవలు స్ఫూర్తిదాయకం : ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఉపాధ్యాయ వృత్తికి శ్రీరామమూర్తి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు చెప్పారు. కేవలం ఉపాధ్యాయునిగా కాకుండా సమాజంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర గురించి ఆయన పాటుపడే వారని చెప్పారు. ఇంకా ఎక్కువ మందికి సేవ చేయాలనే ధ్యేయంతో సిపిఎంలో చేరారని, ఆయన ఎందరో ఉత్తమ విద్యార్థులను, ఉపాధ్యాయులను తయారు చేశారని చెప్పారు. రైతాంగ పోరాటం, సాహిత్య రంగం ఇలా అన్ని రంగాల్లో తొమ్మిది దశాబ్దాల పాటు అందించిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం శ్రీరామమూర్తిపై పాట పాడి అందరినీ ఆకట్టుకున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలనూ కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసుకుపోతోందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.కృష్ణయ్య చెప్పారు. శ్రీరామమూర్తి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి పెట్టినప్పుడు రూ.20 లక్షల కోట్ల ఆదాయం రాగా ప్రస్తుతం రూ.40 లక్షల కోట్లకు పెరిగిందని, ఉదయం టీ, టిఫిన్ నుంచి రాత్రి పడుకునే ముందు భోజనం వరకూ అన్నింటిపైనా జిఎస్‌టి దోపిడీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెవిఎన్ గోపాలన్, ఛాంబర్ కార్యదర్శి కెవి.సీతారాం, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, సోమరాజు, కె.శ్రీదేవి, వి.కనకదుర్గ, ఐద్వా జిల్లా కార్యదర్శి పోగాకు పూర్ణ, సిపిఎం సీనియర్ నేతలు జవ్వాది శ్రీనివాస్, కౌరు పెద్దిరాజు, కేతా సూర్యారావు, ఆకుల హరేరామ్, పెన్మెత్స సుబ్బరాజు పాల్గొన్నారు. శ్రీరామమూర్తి కుమారులు రామకృష్ణ, రవీంద్రను బలరాం సభకు పరిచయం చేశారు. వారు పార్టీలో చేరాలని జిల్లా కమిటీ ఆహ్వానించింది.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, నేతలు

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి దినపత్రిక నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య చెప్పారు. ఆదివారం అభ్యుదయవాది, అమరజీవి వలవల శ్రీరామమూర్తిపై ప్రచురించిన ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆయన విడుదల చేశారు. ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని పత్రికలూ పార్టీ పత్రికలయ్యాయని, ప్రజలకు ఉపయోగపడే సమాచారం, ప్రజా సమస్యలు వెలికితీసే పత్రికలు కరువయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బలరాం, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కేతా సూర్యారావు, శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు రామకృష్ణ, రవీంద్ర పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి నిమ్మల రామానాయుడు ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆసక్తిగా కాసేపు చూశారు.

ప్రజా హక్కుల కోసం దుర్గారావు పోరాటం ఎనలేనిది

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కమ్యూనిస్టులు కొవ్వొత్తి మాదిరిగా కరిగిపోతూ సమాజానికి ఎన్నో వెలుగులను అందించారని సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో సిపిఎం నేత యెలినేని దుర్గారావు సంస్మరణ సభ ఆదివారం పట్టణ కార్యదర్శి ఎంఆర్.హనుమాన్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక, కార్మిక, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం నిత్య పోరాటం చేసి కమ్యూనిస్టులు తమ జీవితాలను కొవ్వొత్తిలా కరిగించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని సోదాహరణంగా వివరించారు. యెలినేని దుర్గారావు కుటుంబానికి కమ్యూనిస్టులుగా సమాజంలోని అన్ని తరగతుల ప్రజల హక్కుల సాధన కోసం అహర్నిశలు పోరాటం చేసిన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్.తులసీరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఐ రాష్ట్ర నాయకులు సిహెచ్.రామారావు, కొమ్మల నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఝాన్సీ, పాతూరి రవి, టిడిపి నాయకులు కాపా శ్రీనివాసరావు, మరీదు శివరామకృష్ణ, నూతక్కి వేణు, పట్టణంలో ప్రముఖులు పాల్గొన్నారు.



దుర్గారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

జిల్లాలో 491 స్వయం సహాయక సంఘాల లఖ్ - పతి దీదీ లకు రూ. 55.18 కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ - కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

మహిళల్లో ఆర్థిక స్వాలంబన పెంపొందించి, ప్రతి మహిళనూ లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మహారాష్ట్రలోని జెల్గాన్ నుంచి ఆదివారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్-పతి దీదీ కార్యక్రమం కింద మహిళలను సత్కరించే కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్రమోడి పాల్గొన్నారు. ఈమేరకు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లఖ్-పతి దీదీ కార్యక్రమం కింద మహిళలను లక్షాధికారులను చేయాలని, వారు అన్ని రంగాల్లో వ్యాపారవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించిన రుణాన్ని ఉపయోగించుకొని జీవనోపాధి పెంపొందించుకోవడమే కాకుండా కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకొని అభివృద్ధి సాధించేందుకు ఈ అవకాశాలను ఉపయోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో 491 స్వయం సహాయక సంఘాల సభ్యులైన లఖ్-పతి దీదీలకు రూ.55.18 కోట్లు బ్యాంకు లింకేజీ కింద రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కొయ్యలగూడెం, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో 28 స్వయం సహాయక సంఘాలకు రూ. 40 లక్షల చెక్కును పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఆర్థిక పరిపుష్టి దిశగా అడుగులు వేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నాయన్నారు. దేశానికి ఆదర్శంగా రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిలవాలన్నారు. స్వయం సహాయ సంఘాలు తీసుకున్న రుణాలను జీవోపాధి పద్ధతులు పాటించడం ద్వారా మరింత ఆర్థిక పరిపుష్టి సాధించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ స్వయం సహాయ సంఘాలకు జిల్లాలోని 4 మండలాల సమాఖ్యలకు 12 గ్రామాల సంఘాలకు 28 స్వయం సహాయక సంఘాలకు రూ.40 లక్షల చెక్కు, బ్యాంకు లింకేజీ కింద 491 స్వయం సహాయక సంఘాలకు రూ. 55.18 కోట్లు చెక్కులను అందజేశారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సన్మాన ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఎం అనిత, ఎపి స్త్రీనిధి బ్యాంక్ డైరెక్టర్ తోట కృపామణి, స్వయం సహాయక సంఘాల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మహిళా సభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలి

ఎపి జెఎసి అమరావతి స్టేట్ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలని ఎపి జెఎసి అమరావతి స్టేట్ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు కోరారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పిఆర్‌సి కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే నియమించి, నిర్ణీత కాలపరిమితిలోపు నివేదిక తెప్పించుకుని, వీలైనంత త్వరగా 12వ పిఆర్‌సి అమలు చేసి, గత 11వ పిఆర్‌సి సందర్భంగా తీవ్రంగా నష్టపోయిన ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఏలూరు రెవెన్యూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 26 జిల్లాల ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమావేశం అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు. పెన్షనర్లకు అడిషనల్ కౌంటమ్ ఆఫ్ పెన్షన్ పాత స్లాబ్లు పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి కేవలం కొంతమందిని ప్రధానంగా ఆరోగ్య శాఖలో వారిని క్రమబద్ధీకరణ చేశారన్నారు. విద్య, ఇతర శాఖల్లో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులను నేటికీ క్రమబద్ధీకరించలేదన్నారు. వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. ఇప్పటివరకు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులుకు బెనిఫిట్స్ అందడంలేదన్నారు. అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. ఎపి జెఎసి అమరావతి అనుబంధ సంఘాల్లో సభ్యులు ఎపి ఎన్‌జిఒ, ఎపిజిఇఎ వంటి కామన్ కేటగిరీ, ఇతర ఏ సంఘాల సభ్యత్వం తీసుకోరాదని, అనవసరమైన వివాదాలకు దారితీసే బహుళ సభ్యత్వాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వం తొలగించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తించేలా చూడాలని కోరారు. ఇప్పటివరకు ఎపి జెఎసి అమరావతిలో రాష్ట్ర కోశాధికారిగా పనిచేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యకుడు వివి.మురళీకృష్ణనాయుడు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయనను సత్కరించారు. నలుగురు సభ్యులను కొత్తగా ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. కనపర్తి సంగీతరావును రాష్ట్ర కోశాధికారిగా, జనుకుల శ్రీనివాసరావు రాష్ట్ర కో ఛైర్మన్‌గా, డిజి.ప్రసాదరావు రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా, కోనా ఆంజనేయకుమార్(చంటి) రాష్ట్ర కార్యదర్శిగా తీసుకున్నారు. ఈ సమావేశంలో అమరావతి అసోసియేట్ ఛైర్మన్ టివి ఫణి పేర్రాజు, కోశాధికారి వివి.మురళీకృష్ణనాయుడు, ప్రచార కార్యదర్శి బిషోర్ కుమార్, స్టేట్ ఉమెన్ కమిటీ చైర్ పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి పాల్గొన్నారు.

వర్షాలకు నీట మునిగిన వరిచేలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. వర్షాలు, కాలువలకు నీరు ఒకే సమయంలో రావడంతో వరి చేలు ముంపు బారిన పడ్డాయి. ఈ వర్షాలకు డ్రెయిన్లు ఎదురు తన్నడంతో వరద నీరు బయటికి వెళ్లే మార్గం లేక చేలల్లో రోజుల తరబడి నిలిచిపోవడంతో చేలు ముంపు బారిన పడి వరి పైరు నీటిలో కుళ్లి చచ్చిపోయింది. దీంతో రైతన్నలకు ఏమి చేయాలో తెలీక లబోదిబోమంటున్నారు. ముదినేపల్లి అంబేద్కర్ కాలనీ వద్ద ఉప్పల రాజా అనే కౌలు రైతు 2.60 సెంట్లు కౌలుకు సాగు చేశాడు. గత జూన్ నెలలో నేరుగా చేలో విత్తనాలు వెదజల్లాడు. గత నెలలో కురిసిన వర్షాలకు చేలు ముంపు బారిన పడి విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో చేనును దమ్ము చేసి నారు కొనుగోలు చేసి మళ్లీ రెండోసారి నాట్లు వేశాడు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు చేను పూర్తిగా నీట మునిగి పైరు చచ్చిపోయింది. దీంతో ఏమి చేయాలో పాలుపోక కౌలు రైతు రాజా తల పట్టుకుంటున్నాడు. ఇప్పటికే రూ.30 వేలు పైబడి రెండు దఫాలుగా అప్పులు చేసి పెట్టుబడులు పెట్టానని రైతు వాపోతున్నారు. భారీ వర్షాలు, వంట బోదెల్లో నీరు ఉధృతంగా ప్రవహించి బోదె గట్లు దాటి చేల్లోకి రావడంతో వరి పైరు అంతా నీట మునిగిందని రైతు చెబుతున్నాడు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పైరు నీటిలో నాని కుళ్లిపోయిందన్నాడు. ప్రభుత్వం స్పందించి తనకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని కౌలు రైతు రాజా అధికారులను కోరుతున్నాడు.



నీట మునిగిన వరి చేలు

దళిత యువకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

బందంచర్లలో దళిత యువకులపై పెట్టిన అక్రమ కేసులు పోలీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బంధంచర్లలో దళిత సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న ఎస్‌సి వర్గీకరణకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా హోటల్ మూసివేసి బంద్‌కు సహకరించాలని కోరిన యువకుడు పవన్‌పై హోటల్ యజమాని దివాకర్ అతని కుటుంబ సభ్యులు కత్తితో దాడిచేసి గాయపర్చిన సంఘటనపై బాధితులకు అండగా నిలబడాల్సిన పోలీసులు బాధితులపైనే అక్రమ కేసులు బనాయించి ఉద్యోగాలు చేసుకుంటున్న, చదువుకుంటున్న యువకులను విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. దాడికి గురైన పవన్‌కు న్యాయం చేయాలని, దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, లేని పక్షంలో జిల్లా, రాష్ట్ర దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరగకపోతే, కేసులు ఉపసంహరించకుంటే చలో టి.నరసాపురానికి పిలుపునిస్తామని, పెద్దఎత్తున దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు కల్వకుర్తి నాగేశ్వరరావు, లంకపల్లి భాను, దళిత సంఘాల నాయకులు పొర్లపాటు బాబు, మద్ద ఆనంద్, దారా పేర్రాజు, జయపాల్ మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని గత వైసిపి ప్రభుత్వం నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. అదాని, షిరిడి సాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టిందన్నారు. ఇందులో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందన్నారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందని, హైకోర్టులో పిటీషన్లు వేశారని, నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని, వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాల్లోను మీటర్లు బిగిస్తున్నారని, తదుపరి నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మొదటి దశలో వ్యవసాయం పంపు సెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరుపెట్టే ప్రమాదం ఉందన్నారు. ఆ తరువాత నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్ని బట్టి అదనపు ఛార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయటం తదితర రూపాల్లో భారం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందని విమర్శించారు. వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని, లేకపోతే పెద్దఎత్తున రైతులను, ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

తమ్మిలేరుపై కాజ్‌వేకు శాశ్వత పరిష్కారం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామం నుంచి చింతలపూడి మండలం శివాపురం గ్రామాల మధ్యన తమ్మిలేరు కాజ్‌వే గతంలో నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం లోపం వల్ల చిన్నంపేట గ్రామం వైపు తమ్మిలేరు వరద ఉధృతి ఎక్కువగా వచ్చినప్పుడు బ్రిడ్జి అనుకుని గండిపడటం తరచూ జరుగుతుంది. అనేకమార్లు గండిపడగా తాత్కాలిక మరమ్మతులు చేసిన శాశ్వత పరిష్కారం లేకుండా పోయింది. చిన్నంపేటలోని కాజ్‌వేను మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం పరిశీలించారు. అనంతరం టిడిపి సీనియర్ నేత వెల్ది శ్రీనివాసరావు గృహం వద్ద మంత్రి మాట్లాడుతూ తమ్మిలేరుపై కాజ్‌వేకు బ్రిడ్జి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నారు.

కళాకారుల బకాయిలు విడుదల చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం భాషా సాంస్కృతిక శాఖ సమాచార శాఖ కళాకారుల ద్వారా కళారూపాలు ప్రదర్శించిన కళాకారులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు డిమాండ్ చేశారు. మండలంలోని బొర్రంపాలెంలో వీరమల్ల సత్యనారాయణ ఇంటి వద్ద షేక్ సుభాని అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జానపద కళాకారుల సంఘం సమావేశంలో ఎల్ఆర్.కృష్ణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సంబంధించిన కళాకారుల ప్రదర్శనల వేతనాలు ఇప్పించాలని ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సంబంధిత అధికారులకు కోరగా నాలుగు మాసాల్లో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని నెలలు గడుస్తున్నా బకాయిలు విడుదల చేయలేదన్నారు. ఏపి ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ టిపిఎస్.రాజు మాట్లాడుతూ కళా ప్రదర్శనలు ఇచ్చి తమ కుటుంబాలను పోషించుకునే కళాకారులకు మరొక ఆర్థిక ప్రత్యామ్నాయం లేనందున వారికి రావాల్సిన బకాయిలు ఇప్పించి కళాకారుల కుటుంబాలు ఆకలి కేకలను ఆపాలని ఆయన కోరారు. జెండాలు మారినా, ప్రభుత్వాలు మారినా కళాకారుల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు తమ విజయం కోసం కళాకారులను ఉపయోగించుకుంటున్నారని, గెలిచిన ఓడిన నాలుగు నెలలపాటు అనంతరం పాలక పక్షం ప్రతిపక్షం సైతం కళాకారులను కరివేపాకులా ఉపయోగించుకుంటున్నారని. కళాకారులను ఉపయోగించుకుని అవసరం తీరాక పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు మానవతా దక్పథంతో ఆలోచించి కళాకారుల బకాయిలు చెల్లించి వారి ఆకలి తీర్చి ఆదుకోవాలని కోరారు.

వన్‌టౌన్ ఎస్ఐగా మదీనబాష బాధ్యతలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఒకటో పట్టణ ఎస్ఐగా మదీన బాష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు రెండో పట్టణ ఎస్ఐగా పని చేస్తున్న షేక్ మదీనా బాష ఒకటో పట్టణ ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఒకటో పట్టణ ఎస్ఐగా పని చేస్తున్న పి.నవీన్‌కుమార్ జీలుగుమిల్లి ఎస్ఐగా బదిలీ అయ్యారు.



మదీనబాష

జీలుగుమిల్లి ఎస్ఐగా నవీన్‌కుమార్

జీలుగుమిల్లి :జీలుగుమిల్లి ఎస్ఐగా పి.నవీన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు వన్‌టౌన్ నుంచి జీలుగుమిల్లి స్టేషన్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ చంద్రశేఖర్ కొయ్యలగూడెం బదిలీ అయ్యారు.



నవీన్‌కుమార్

తడికలపూడి ఎస్ఐగా చెన్నారావు

కామవరపుకోట :తడికలపూడి ఎస్ఐగా పి.చెన్నారావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పనిచేస్తున్న ఆయన తడికలపూడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎం.జయబాబు టి.నరసాపురం బదిలీపై వెళ్లారు.



చెన్నారావు

సీతారామనగరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని సీతారామనగరంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అమరవరం పిహెచ్‌సి వైద్యులు ఎస్.అనంత్, ఎ.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. శిబిరంలో 73 మంది ఓపి నమోదైంది. గ్రామంలో బోరు నీరు, మోటార్ నీరు, బావి నీటిని పరీక్షల నిమిత్తం సేకరించి ఏలూరు వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌కు నీటి నమూనాలను పంపించారు. గ్రామంలో సైపన్ మిత్రన్ మిశ్రమాన్ని ప్రతి ఇంటికి పిచికారీ చేపిస్తామని డాక్టర్ ఎస్.అనంత్ తెలిపారు. గ్రామంలో జ్వరం అదుపులోకి వచ్చేంతవరకు తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా గ్రామంపై శ్రద్ధ పెట్టి జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు తరచూ చెకప్ చేస్తామని మెడికల్ ఆఫీసర్ ఎ.శ్రీకాంత్, అనంత్ తెలిపారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ సురేష్ పరిశీలించారు.

రామచంద్రపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లమాడు పరిధి రామచంద్రపురంలో జ్వరాల తీవ్రత దృష్ట్యా దోమల నివారణ కోసం పిచికారీ చేయించి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించామని కార్యదర్శి కిషోర్ చెప్పారు. మురుగునీరు ఆగకుండా బోదెలు శుభ్రం చేయించారు. వార్డు సభ్యుడు గౌతు రాఘవరాజు, జనసేన నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 29వ తేదీ హాకీ మాంత్రికుడు పద్మభూషణ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 26వ తేదీ నుంచి 31 వరకు వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. అవుట్ డోర్, ఇండోర్ క్రీడలు, ఫన్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందినవారికి సర్టిఫికెట్లు ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు వేడుకల్లో అందించనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా నుంచి వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించనున్నట్లు తెలి పారు. జిల్లాలో పనిచేస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులు, జిల్లా క్రీడా సంఘాల ప్రతిని ధులు ప్రత్యేక శ్రద్ధ కనపరిచి వారి వారి విద్యార్థులనుపై క్రీడాంశాల్లో పాల్గొనే విధంగా తగు చర్యలు తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చినవెంకన్న ప్రాణదాన ట్రస్టుకు మందులు అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి ఆయం ప్రాణదాన ట్రస్టు ఉచిత ప్రథమ చికిత్స కేంద్రానికి ఆదివారం తెనాలికి చెందిన ఎవి.సాంబశివరావు రెండు వేల మందికి సరిపోయే ఉచిత మందులు అందించారు. మందులను ద్వారకాతిరుమలకు వచ్చే యాత్రికుల అవసరాల కోసం ఉపయోగించాలని ప్రథమ చికిత్స కేంద్రం డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను కోరారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆదేశాల మేరకు దాతకు ఉచిత దర్శనం తీర్థ ప్రసాదాలు అందించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జ్వరంతో బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నె వినోద్ మాట్లాడుతూ వైరల్ జ్వరాలకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు జ్వరాలు వచ్చాయని గురువారం తెలిసినప్పటికీ రక్త పరీక్షలు చేయించి వైద్యం అందించడంలో, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియపరచడంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, పాఠశాలలో వైరల్ ఫీవర్స్ అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాలకు నిలయం ఆ రోడ్డు..!

రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు

ప్రమాదాల బారిన వాహనదారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మదినేపల్లి వయా అన్నవరం మీదుగా వదాలి, దేవవరం గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు నిత్యం ప్రమాదమయంగా మారింది. ఈ రోడ్డు ఆసాంతం రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. దీంతో రోడ్డు పైకి చెట్ల కొమ్మలు ముళ్ల తుప్పలు వ్యాపించాయి. దీంతో ఈ రోడ్డుపై పాదచారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డులో నిత్యం పాఠశాలలు వెళ్లే విద్యార్థులు, ప్రజలు, వ్యవసాయ కూలీలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అన్నవరం, దేవరం గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో సరిగా దారి కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. దీనికి తోడు ఈ రహదారిలో ఎక్కువ మలుపులు ఉండడంతో ప్రమాదాలకు ఇదో కారణం. మలుపుల వద్ద పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా ఎదురు వచ్చే వాహనం కనబడక, రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా తప్పుకునే క్రమంలో పక్కనే ఉన్న పంట బోదె లోకి పల్టీ కొడుతున్నాయి. లేక రోడ్డు మార్జిన్‌లో దిగబడి పోతున్నాయి. దీంతో తరచూ ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాల వల్ల పాదచారులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో పిచ్చి మొక్కలు వ్యాపించి వాటి కొమ్మలు రోడ్డుపైకి వచ్చాయి. దేవరం, అన్నవరం గ్రామాల్లో ఆక్వా సాగు ఎక్కువగా ఉంది. ఈ చేపల చెరువులకు మేతలు తీసుకువెళ్లే లారీలు, ఆటోలు, బైకులు, స్కూల్ వ్యాన్లతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో రోడ్డుపై నడిచి వెళ్లే జనం తప్పుకునే అవకాశం లేదు. సింగిల్ రోడ్డు కావడం, ఇరుకుగా మారడంతో వేగంగా వెళ్లే వాహనాల వల్ల తప్పుకునే అవకాశం లేక తరచూ ప్రజలు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డులో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. కొత్తగా అన్నవరంలో జగనన్న కాలనీ ఏర్పడటంతో రోడ్డుపై ప్రజల రాకపోకలు ఎక్కువగా పెరిగాయి. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటూ ప్రమాదమయంగా మారింది. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను, రోడ్డుపైకి వ్యాపించిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రజలు, వాహన దారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



మలుపు వద్ద పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు

ఎస్‌సిలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ఎస్‌సి కమిషన్ కృషి

సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సిలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ఎస్‌సి కమిషన్ కృషి చేస్తుందని సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ చెప్పారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సిలపై దాడులు చేసిన వారిపై ఎస్‌సి కమిషన్ ద్వారా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎస్‌సిలపై దాడులు జరగకుండా రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంపై అవగాహన లేకపోవడంతో ఎస్‌సిలై దాడులు జరుగుతున్నాయని, ఈ చట్టంపై సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చట్టాన్ని బలోపేతం చేయాలని, తద్వారా దాడులను అరికట్టవచ్చని తెలిపారు. దేశంలో అందరూ సమానమనే భావన ప్రజలందరూ కలిగి ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చూడాలన్నారు. అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసేలా కేసులు వస్తే వాటిని పోలీస్ వారు నిర్వీర్యం చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌సిలకు నష్టపరిహారం కింద అందించాల్సిన పెండింగ్ సొమ్మును త్వరితగతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

పెదపాడు : రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ మండలంలోని వట్లూరు గురుకుల పాఠశాలను ఆదివారం సందర్శించారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థులను, ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీరాణిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఒ భారతి, డిప్యూటీ తహశీల్దార్ ఎన్‌విడివి.ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, విఆర్ఒ రాంబాబు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కైకరంలో చెరువు ఆక్రమణదారుల మధ్య తగాదాలు

పోలీసుల రంగ ప్రవేశం

చెరువు కబ్జాదారులకు నోటీసులు ఇస్తామంటున్న అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో అతి పెద్ద గ్రామం కైకరంలో రంగమ్మ చెరువు అంతర్భాంగాతో పాటు గట్టు వెంబడి యథేచ్ఛగా ఆక్రమణలు చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన గ్రామ కంఠం సర్వే నెంబర్ 456/1లో 2.1 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమిలో పూర్వం ఎప్పుడో చెరువును నిర్మించారు. అందులో చేపల పెంపకం ద్వారా పంచాయతీకి గతంలో ఆదాయం వచ్చేది. గ్రామానికి నడిబొడ్డున ఉండే ఈ చెరువు వెంబడి గతంలోనూ చాలా ఆక్రమణలు జరిగాయి. శాశ్వత కట్టడలు సైతం ఉన్నాయి. తాజాగా ఓ రాజకీయ పార్టీ మద్దతులో కొంతమంది చెరువు గర్భంలో ఇనుప స్తంభాలు పాతి ఐరన్ రేకులతో షెడ్లు వేశారు. గతంలో నుంచి అక్కడే నివాసం ఉంటున్న స్థానికులు మా ఇంటి ముందు ఆక్రమణలు ఏంటని ఎదురు ప్రశ్నించడంతో వివాదాలు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా మరో రాజకీయ పార్టీ నేతల అండదండలో మరికొందరు ఆక్రమిస్తూ కర్రలు పాతుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆక్రమణదారుల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని తాత్కాలికంగా చక్కదిద్దారు. కాగా రంగమ్మ చెరువు వెంబడి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామని కార్యదర్శి నాగేంద్ర చెప్పారు. ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుల ప్రకారం రంగమ్మ చెరువుగా పిలుస్తున్న భూమి గ్రామ కంఠంలో ఉందని కాలక్రమేణ చెరువుగా మారిందని విఆర్ఒ భీమవరపు నాగేశ్వరరావు చెప్పారు.

'పంచాయతీల అభివృద్ధికి టిడిపి కూటమి కృషి'

ఏలూరు సిటీ :పంచాయతీల అభివృద్ధికి టిడిపి కూటమి కృషి చేస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13,326 పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.38.46 లక్షల విలువైన 43 పనులకు ఆమోదం తెలిపారన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో పారదర్శకతతో పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి గ్రామంలో ఒకే రోజు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారని అన్నారు. పంచాయతీ పరిధిలోని వారంతా కూర్చొని గ్రామాభివృద్ధి మీద నిర్ణయాలు తీసుకొనేలా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో, పారదర్శకంగా నిధులు వెచ్చించుకొనేలా గ్రామ సభలను నిర్వహిస్తున్నారన్నారు.

ముసునూరులో బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో సుమారు రూ.30 వేల విలు వైన బెంచీలు టిడిపి నాయకులు పాకనాటి సీతారామంజనేయులు వితరణగా అందించారు. బెంచీ బల్లలు గ్రామంలోని అన్ని ప్రధాన సెంటర్లలో వృద్ధులు, ప్రయాణికులు, పలువురు బాటసారులు కూర్చునే విధంగా ఏర్పాటు చేశారు.



బల్లలు అందిస్తున్న టిడిపి నాయకులు

పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం

ప్రజాశక్తి - దెందులూరు

సమిష్టి కృషితోనే సత్ఫలితాలు లభిస్తాయని ఏలూరు పీఠం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేలు, సెయింట్ జాన్స్ విద్యాసంస్థల వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ జిజె చార్లెస్ అన్నారు. ఆది, సోమవారం సెయింట్ జాన్స్ విద్యాసంస్థల్లో పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం, ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాల అధ్యక్షతన నిర్వహించారు. కళాశాలలో చనిపోయిన అధ్యాపకులు, విద్యార్థులకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ చార్లెస్ ఉపాధ్యాయులను ఫాదర్ బాల, ఇమ్మానుయేలులు సత్కరించారు. ఫాదర్ ఇమ్మానియేల్‌ను ఫాదర్ బాల ఉపాధ్యాయులు సత్కరించి జ్ఞాపికను అందించారు.

వికలాంగులకు త్రిచక్ర వాహనాలు అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వికలాంగులకు చదువుతో సంబంధం లేకుండా త్రిచక్ర వాహనాలను అందించాలని, 2016 వికలాంగుల చట్టాలను రాష్ట్రంలో అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ నాయకులు కొండేటి జయరాజు అన్నారు. మోడల్ కాలనీలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల శాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ కన్వీనర్ గంధం ఝాన్సీరాణి మాట్లాడుతూ వికలాంగులందరికీ ఇళ్ల స్థలాలు, అభ్యుదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఆర్‌విఎస్.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, వెంకటేశ్వరరావు, మన్మధరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం(గ్రా) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని ఎంపిడిఒ పి.శంకరరావు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో విజయవాడ సెంటినీ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ ఛైర్మన్ కాసల కోనయ్య, ప్రధాన కార్యదర్శి పి.సురేష్‌కుమార్, జిల్లా ఛైర్మన్ ఎన్.రామకృష్ణ, మీడియా ఛైర్మన్ ఎస్-ఎస్.బాబు, సతీష్‌కుమార్, పివి.కోటేశ్వరరావు, మురళీధర్, వైద్యులు కె.కృష్ణచంద్, కె.రాకేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు :ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు సిరికొండ రామారావు మాట్లా డుతూ వ్యవసా యానికి ఉచితంగా అన్నిరకాల విత్తనాలు ఇవ్వాలన్నారు. కుక్కునూరు దాచారం మధ్య గుండేటి వాగు బ్రిడ్జిపై పడిన గండి పూడ్చాలని కోరారు.